హుజురాబాద్‌లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఐలోని మల్లన్న దేవాలయం సమీపంలో భారీగా మల్లన్న పట్నాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని ప్రజలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ..మల్లన్న దేవాలయం పవిత్రతకు భంగం కలిగే విధంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం అసలు అంగీకరించలేము. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. డంపింగ్ యార్డ్ వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు దుర్వాసన, కాలుష్యం పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు పంట భూములు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. పశువుల ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతుంది." అని అన్నారు.అదేవిధంగా మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, దేవాలయ పవిత్రత అన్నీ ముఖ్యమైనవి. ప్రజలకు నష్టం కలిగించే డంపింగ్ యార్డ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. అవసరమైతే ప్రజలతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భారీగా మహిళలు, రైతులు, యువకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# వడదెబ్బతో మృతి చెందిన సతీష్ కుటుంబానికి ఆర్థిక సాయం

## హెల్పింగ్ హ్యాండ్స్ అండ రూ.20 వేల అందజేసిన బంచరాయితండ సేవా బృందం

**కురవి, ఏప్రిల్ 19 (జనం వాయిస్):**



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానోత్ సతీష్ (తండ్రి బిక్కు) వడదెబ్బకు గురై మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ కష్ట సమయంలో గ్రామంలోని "హెల్పింగ్ హ్యాండ్స్" సేవా బృందం ముందుకు వచ్చి మానవతా విలువలను చాటుకుంది. హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సతీష్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సభ్యులు మాట్లాడుతూ, ఏప్రిల్ 11 రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. ప్రతిరోజూ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న సతీష్, ఆ రోజు కూడా సాధారణంగానే పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడని చెప్పారు. అయితే రాత్రి అకస్మాత్తుగా అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలతో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వివరించారు. సతీష్‌కు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబం పూర్తిగా ఆయన ఆదాయంపైనే ఆధారపడి ఉండటంతో, ఆయన మరణం వారి జీవనాధారాన్ని కుదిపేసింది. ఈ నేపథ్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు స్పందించి వెంటనే సహాయం అందించడం గ్రామ ప్రజల ప్రశంసలను అందుకుంది. గత ఏడు సంవత్సరాలుగా హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం అందించడం, పేద కుటుంబాల్లో మరణాలు సంభవించినప్పుడు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. "ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా ఎవరికైనా కష్టం వస్తే ముందుండి సహాయం అందిస్తాం" అని గ్రూప్ సభ్యులు తెలిపారు. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలబడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. బంచరాయితండలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగడం సమాజంలో సహానుభూతి, పరస్పర సహకార భావనలను మరింత బలపరుస్తోందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

# రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫలితం సాధించిన హిమబిందుకు ఘన సన్మానం

**మహబూబాబాద్, ఏప్రిల్ 19 (జనం వాయిస్):**

మహబూబాబాద్ మండలం నడివాడ గ్రామానికి చెందిన సుంకరి హిమబిందు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితం సాధించి గ్రామానికి కీర్తి తీసుకురావడంతో ఆమెకు ఘన సన్మానం నిర్వహించారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బైపీసీ చదివిన హిమబిందు ఇంటర్ పరీక్షల్లో 1000 మార్కులకు 985 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా స్వగ్రామం నడివాడలోని ఆమె నివాసంలో "గుడ్ ఫ్రెండ్స్" సభ్యులు ఆర్థిక వితరణ చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబాబాద్ రూరల్ ఎస్ఐ దీపికా రెడ్డి హాజరై విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యసాధన కోసం సంకల్పబలం తో ముందుకు సాగాలని సూచించారు. హిమబిందు మట్టిలో మాణిక్యమని, గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆణిముత్యమని కొనియాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు భవిష్యత్ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలికల కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం, అధ్యాపకులు చొప్పరి శ్రీనివాస్, గుడ్ ఫ్రెండ్స్ సభ్యులు గాంతి దేవేందర్ రెడ్డి, మేడ వెంకటేశ్వర్లు, మైస శ్రీనివాసులు, బానోత్ కిషన్, గుగులోత్ దేవుసింగ్, తోడేటి వెంకన్న, వాసం నాగేశ్వర్ రావు, బి. కిషన్, శంకర్, బూర్ల ప్రభాకర్, నడివాడ గ్రామ సర్పంచ్, మా అసోసియేషన్ బాధ్యులు మందుల రఘు తదితరులు పాల్గొన్నారు.



# రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల

**జనం వాయిస్, కురవి, ఏప్రిల్ 19:**




రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా పథకం కింద అందించే రెండో విడత ఆర్థిక సహాయాన్ని ఏప్రిల్ 20న ప్రభుత్వం విడుదల చేయనుంది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నాస్తూర్‌పల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రుల సమక్షంలో ఈ నిధులను అధికారికంగా విడుదల చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. రైతులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి నర్సింహా రావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

# నేడు ప్రజావాణి రద్దు

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, ఏప్రిల్ 19 (జనం వాయిస్):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా (నేడు) అనగా ఏప్రిల్ 20, నుండి వారం రోజులు సంక్షేమ వారోత్సవాలు (సోమవారం మొదటి రోజు ప్రారంభం) సందర్భంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యంత్రాంగం సంక్షేమ వారోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా క్షేత్రస్థాయిలో జిల్లా అధికారులందరూ నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రజావాణి దరఖాస్తులతో ఈ సోమవారం కార్యాలయమునకు రావద్దని కలెక్టర్ కోరారు.



# గ్రామపంచాయతీ కార్మికుల కు గత రెండు నెలలుగా పెండింగ్ లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలి

- లేనట్లయితే కరీంనగర్ కలెక్టరేట్ ముందు ఆందోళన చేపడుతాం.
- సి ఐ టి యు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్.




**జనం వాయిస్, హుజురాబాద్:**

ఆదివారం రోజున స్థానిక హుజురాబాద్ సిఐటియు మండల కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ కార్మికులను మోసంచేస్తున్నాయని, పత్రికలు వివిధ ఛానల్ ద్వారా ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా దేశవ్యాప్తంగా అంన్ స్కిల్డ్ వర్కర్ కు దినసరి వేతనం 783, సెమీస్కిల్డ్ వర్కర్ కి 868 రూపాయలు, స్కిల్డ్ వర్కర్ కి 954 రూపాయలు అలాగే హై స్పీడ్ వర్కర్ కి 1035, అమలు చేయాలని, కేంద్రం తీసుకొచ్చిన కార్మిక 4 లేబర్ కోడ్లచట్టం ద్వారా, అమలవుతాయని, దేశంలోని కార్మిక వర్గానికి మేలు జరుగుతుందని ఒక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చి ఆర్ బాట ప్రచారాలు చేసిన ప్రభుత్వాలకు ఇచ్చే 9500 వేతనాలు కూడా ప్రతి నెల ఇవ్వకుండా కుటుంబాలు గడవలేని దీనస్థితిలో ఉన్న పంచాయతీ కార్మికులను అడిగితే తెలుస్తుంది రాష్ట్ర ప్రజా పరిపాలన, మోడీ వచ్చేదిన్ దొందు దొందే అన్నట్లుగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న విధానాలతో కార్మికుల కొనుగోలు శక్తి పడిపోయి కనీస వేతనాలు అందక కుటుంబాలు పోషించుకోవడం దుర్భరమైన పరిస్థితులు దాపరించాయని, మోసపూరిత ప్రకటనతో కార్మికులనుమభ్యపెడుతున్నాయని ప్రభుత్వాలు కార్మికులందరు ఐక్యమై పోరాటాలు నిర్వహిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చొప్పదండి బిక్షపతి, మరలమరి రవి ఆకునూరి సుధాక ర్ పాల్గొన్నారు.

RNI NO:TGTEL/26/A0383
దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# మహబూబాబాద్‌లో ఉచిత సమ్మర్ ఆర్చరీ కోచింగ్ క్యాంప్

**మహబూబాబాద్, ఏప్రిల్ 19 (జనం వాయిస్):**



మహబూబాబాద్ (మానుకోట) పట్టణం పరిసర ప్రాంతాల విద్యార్థుల క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిలో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపొందించేందుకు ఉచిత సమ్మర్ ఆర్చరీ కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు సాదుల సారంగపాణి, డెవలప్మెంట్ మెంబర్ పుట్టా శంకరయ్య నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్, ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్, వరంగల్ జిల్లా ఆర్చరీ అసోసియేషన్, సాదుల ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఈ క్యాంప్ ఈ నెల 26వ తేదీ ఆదివారం నుంచి మహబూబాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభం కానుంది. నెల రోజుల పాటు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. 10 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలురు, బాలికలు ఈ క్యాంప్‌లో పాల్గొనవచ్చని, 4వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. పూర్తిగా ఉచితంగా నిర్వహించే ఈ శిక్షణలో ఆర్చరీ ప్రాథమిక నైపుణ్యాలతో పాటు శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, పోటీ స్థాయి అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు ఇది బలమైన పునాది అవుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలలోని క్రీడా ఆసక్తిని గుర్తించి ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 9394643139, 9494543139 నంబర్లను సంప్రదించాలని ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు సాదుల సారంగపాణి, డెవలప్మెంట్ మెంబర్ పుట్టా శంకరయ్య తెలిపారు.

# బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

**మహబూబాబాద్, ఏప్రిల్ 19 (జనం వాయిస్):**

అక్షయ తృతీయ సందర్భంగా మహబూబాబాద్ జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు షేర్ స్వచ్ఛంద సంస్థ జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్స్ (జేఆర్సి) ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆలయం, మసీదు, చర్చి సమీప ప్రాంతాల్లో ప్రజలకు బాల్య వివాహాల దుష్పరిణామాలపై చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరూ అలాంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. బాల్య వివాహాలు నిర్వహించినట్లయితే శిక్షార్హులవుతారని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1098 లేదా 100 కు సమాచారం అందించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేస్తున్న షేర్ ఎన్జీవో జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సోషల్ కమ్యూనిటీ మొబిలైజర్ రమేష్, సోమన్న, ఉమామహేశ్వరి, హిమబిందు, అంగన్వాడీ టీచర్లు, వార్డ్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# పురుగుమందు తాగి కార్మికుడు మృతి

**ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుండి కూలి పనికి వచ్చి విషాదం.**
**కురవి పోలీసులు రూ.5,000 ఆర్థిక సహాయం అందజేత.**

**కురవి, ఏప్రిల్ 19 (జనం వాయిస్):**

కూలి పనుల నిమిత్తం వచ్చి పనిచేస్తున్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు పురుగుమందు తాగి మృతి చెందిన ఘటన కురవి మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లా నివాసి హిడ్మా సోరి (46) బలపాల గ్రామంలో మామిడికాయలు కోయుటకు కూలి పనికి వచ్చి పనిచేస్తున్నాడు. మృతుడికి ప్రతి రోజు రాత్రి తేనే తాగే అలవాటు ఉండగా, గురువారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో తేనే అనుకొని పక్కనే ఉన్న డబ్బాలోని పురుగుమందును ప్రమాదవశాత్తు తాగాడు. గంట తర్వాత కడుపు నొప్పితో ఇబ్బందిపడుతూ తాను తాగింది పరిశీలించగా అది పురుగుమందు అని గ్రహించాడు. వెంటనే తనతో పాటు కూలి పనికి వచ్చిన బంధువులకు విషయం తెలియజేశాడు. అనంతరం వారు హిడ్మా సోరిని మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా శుక్రవారం తెల్లవారుజామున 1.30 గంటలకు మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి అల్లుడు ముడమి దేవా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మృతుడి కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, మృతదేహాన్ని దంతేవాడ జిల్లా తరలించేందుకు కురవి పోలీసులు రూ. 5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కురవి రెండో ఎస్సై జయకుమార్, పీసీలు హరిబాబు, రమేష్ పాల్గొన్నారు. మానవత్వం చాటుకున్న కురవి పోలీసులకు ప్రజలు అభినందనలు తెలిపారు.



# అబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా కాంపేల్లి శ్రీనివాస్ నియామకం

**జనం వాయిస్, గోదావరిఖని, ఏప్రిల్ 19:**



తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గజ్జెల కాతం ఆదేశాల మేరకు గోదావరిఖని, ఎల్.బి నగర్ కు చెందిన కాంపెల్లి శ్రీనివాస్ గత 10 సంవల నుండి దళిత ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటున్నందుకు రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ ఏరియాకు అధ్యక్షుడిగా నియమిస్తూ తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి జిల్లా ఇంఛార్జ్ అయిన కుక్క చంద్రమౌళి చేతుల మీదుగా నియామక పత్రాన్ని కాంపెల్లి శ్రీనివాస్ కి అందచేశారు. ఈ నియామకానికి నాకు సహకరించి పదవి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు గజ్జెల కాంతం కుక్క చంద్రమౌళి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర నాయకత్వానికి, పెద్దపల్లి జిల్లా దళిత నాయకులకు జై భీమ్ తో కృతజ్ఞతలు తెలిపారు.

# వేసవి సెలవుల్లో "తస్మాత్ జాగ్రత్త"

- పిల్లల చేతికి ఫోన్ ఇస్తున్నారా? ఇక అంతే!.
- పిల్లల భవిష్యత్తుపై 'డిజిటల్' నీడలు.
- ఆటపాటల వైపు మళ్లించకపోతే ముప్పే..!.





**మహబూబాబాద్ / జనం వాయిస్ :**

వేసవి సెలవులంటే ఒకప్పుడు మేనమామ ఊరు, అమ్మమ్మ ఇంటి కబుర్లు, వీధిలో తోటి పిల్లలతో ఆటలు గుర్తొచ్చేవి. సాయంత్రం వేళలో కథలు చెప్పేది. బంధువులపై అవగాహన కల్పించేది. కానీ, నేడు పరిస్థితి తలకిందులైంది. సెలవులు వచ్చాయంటే చాలు పిల్లల చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు ప్రత్యక్షమవుతున్నాయి. గంటల తరబడి స్క్రీన్లకు అతుక్కుపోతూ బాహ్య ప్రపంచాన్ని మర్చిపోతున్నారు. దీనిపై మానసిక నిపుణులు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు ఇప్పుడే మేల్కొనకపోతే పిల్లల భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

**ఫోన్ ఇస్తే.. ఇక అంతే..!**

పిల్లలు అల్లరి చేస్తున్నారనో, తాము పనులు చేసుకోవాలనో చాలామంది తల్లిదండ్రులు సులభమైన మార్గంగా పిల్లల చేతికి ఫోన్ ఇస్తున్నారు. కానీ ఇది "తాత్కాలిక ఉపశమనం.., శాశ్వత నష్టం" అని నిపుణులు చెబుతున్నారు. అతిగా ఫోన్ వాడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత తగ్గడం, కంటి సమస్యలు, నిద్రలేమి, చిరాకు, మొండితనం వంటి లక్షణాలు పెరుగుతున్నాయి. మరీ ముఖ్యంగా సోషల్ మీడియా, అశ్లీల వెబ్‌సైట్లు, హింసాత్మక గేమ్‌ల బారిన పడితే వారి వ్యక్తిత్వం దెబ్బతినే అవకాశం ఉంది. ఆటపాటల వైపు అడుగులు వేయించాలి. సెలవులను పిల్లల మేధోవికాసానికి వేదికగా మార్చాలి.

**ఆటపాటల వైపు అడుగులు వేయించాలి:**

ఫోన్లలో వీడియో గేమ్స్ ఆడే బదులు, మైదానంలో క్రికెట్, ఫుట్‌బాల్, షటిల్ వంటి ఆటలు ఆడేలా ప్రోత్సహించాలి. దీనివల్ల శారీరక దృఢత్వం పెరుగుతుంది. పెయింటింగ్, డ్యాన్స్, సంగీతం వంటి సృజనాత్మక కళలపై అవగాహన కల్పించాలి. లేదా కథల పుస్తకాలు చదివించడం ద్వారా వారి ఊహాశక్తిని, భాషా నైపుణ్యాలను పెంచవచ్చు. తల్లిదండ్రులు వారితో కలిసి ఇంటి పనుల్లో పాలుపంచుకోవడం, పాత తరం కథలు చెప్పడం ద్వారా వారిలో నైతిక విలువలు పెంపొందుతాయి.

**తల్లిదండ్రుల బాధ్యత..?**

పిల్లల చేతికి ఫోన్ ఇచ్చే ముందు.., దానివల్ల కలిగే అనర్థాలను వారికి అర్థమయ్యేలా వివరించాలి. "డిజిటల్ డిటాక్స్" (కొన్ని గంటల పాటు ఫోన్‌కు దూరంగా ఉండటం) పాటించేలా చూడాలి. అన్నింటికంటే ముఖ్యంగా పిల్లల ముందు తల్లిదండ్రులు కూడా ఫోన్ వాడకాన్ని తగ్గించి వారికి ఆదర్శంగా నిలవాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు గుర్తుంచుకోవాల్సింది. ఈ వేసవి సెలవుల్లో మీరు ఇచ్చే స్వేచ్ఛ వారి భవిష్యత్తుకు పునాది కావాలి తప్ప, వారిని ఫోన్లకు బానిసలుగా మార్చే సంకెళ్లు కాకూడదు. తల్లిదండ్రులు పిల్లలపై జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రాష్ట్రంలో ప్రతీ పేదవాడికి పక్కా ఇల్లు

**అందరి కడుపు నింపేందుకు సన్నబియ్యం.**
**జిహెచ్ఎంసి లో విలీనం చేయటం వల్ల వేగంగా అభివృద్ధి.**
**రావిర్యాలలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న.**
**మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.**

**మహేశ్వరం, ఏప్రిల్ 19, (జనం వాయిస్):**

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతీ పేదవాడికి పక్కా ఇళు నిర్మిస్తామని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల్లో కె ఎల్ ఆర్ పాల్గొన్నారు.లబ్ధిదారులతో కలిసి స్వీట్లు పంచుకున్నారు. సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతీ పేదవాడికి పక్కా ఇళ్లు కట్టించి ఇంటిల్లిపాదికి కడుపునిండా సన్నబియ్యంతో భోజనం పెట్టాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. జిహెచ్ఎంసి తో శరవేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని జిహెచ్ఎంసి లో విలీనం చేయటం వల్ల శరవేగంగా అభివృద్ధి జరుగుతుందని కిచ్చెన్నగారు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన, అంతర్జాతీయ స్థాయి వసతులు, సంస్థలు వస్తాయని లక్ష్మారెడ్డి చెప్పారు. ఒక్క రావిర్యాల గ్రామానికే 70 ఇందిరమ్మ ఇళు నిర్మించామని గతంలోనూ పక్కా గృహాలు, స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్థానిక నాయకులు కె ఎల్ ఆర్ దృష్టికి తెచ్చారు.రావిర్యాల చుట్టపక్కల అనేక సంస్థలు రావటం వల్ల స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్ లో స్కిల్ యూనివర్శిటీ ద్వారా మరింత మంది యువతీయువకులకు ఉద్యోగాలు ఇస్తామని కిచ్చెన్న భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రావిర్యాల గ్రామస్థులు, ఇందిరమ్మ లబ్ధిదారులు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందించాలి

**డిఎస్ఓ శ్రీనివాస్ కి పివైఎల్ వినతి.**
**పి.వై.ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రవికుమార్ కొల్లూర్ భీమేష్.**

**మహేశ్వరం, ఏప్రిల్ 19,(జనం వాయిస్):**

రేషన్ షాపుల ద్వారా సరుకులు అందించాలని డిఎస్ఓ శ్రీనివాస్ కి పివైఎల్ వినతి పత్రం అందజేసి కోరారు. సన్న బియ్యం నూకలు కలిసి వస్తున్నాయి. అలాగే హైదరాబాద్ పరిధిలోని రేషన్ షాపుల డీలర్స్ చాలా మంది అందుబాటులో ఉండకుండా, వర్కర్స్తో తోనే పని చేయిస్తున్నారు. అలాగే పబ్లిక్ పట్ల అమర్యాదగా మాట్లాడుతున్నారు. బస్తీలలో తూకాలలో మోసం జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. షాపుల్లో బియ్యంతో పాటు కొన్ని వస్తువులు కొంటేనే బియ్యం ఇస్తామని ప్రజలకు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో ప్రజలు కొనాల్సి వస్తుంది. ఈ సమస్యలను ప్రజలు మా దృష్టికి తీసుకవచ్చారు. ఈ ఘటనలపై డీలర్స్ను మేం నిలదీస్తూనే ఉన్నాము. అయినా కొన్ని చోట్ల జరుగుతూనే ఉన్నాయి. కావున ఈ విషయాల పట్ల డీలర్స్ కు సూచనలు చేయాలని కోరుతున్నామని అలాగే డీలర్స్ వద్ద పనిచేసే హమాలికి 15 రోజుల ఉపాధి మాత్రమే ఉంటుంది. వారికి నెల మొత్తం ఉపాధి కల్పించి, వేతన వెసులుబాటును కల్పించాలని కోరుతున్నాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పి.వై.ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రవికుమార్, పి.వై.ఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష కార్యదర్శులు బిఎస్ కృష్ణ, కొల్లూర్ భీమేష్, నగర నాయకులు, ఎల్ రాజు, సీఎం సుధాకర్, ఎస్ ప్రవీణ్ ఇతర తదితరులు పాల్గొన్నారు.



# మహిళా శక్తికి విఘాతం కలిగిస్తున్న పార్టీలను బహిష్కరిద్దాం

**మహిళలకు రాజకీయ అధికారం దక్క కూడదనే కుట్ర.**
**మహిళ లోకం ఒకసారి ఆలోచన చేయాలి.**
**బిజెపి మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్.**

**మహేశ్వరం, ఏప్రిల్ 19,(జనం వాయిస్):**



మహిళా శక్తికి విఘాతం కలిగిస్తున్న పార్టీలను బహిష్కరిద్దాం అని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ మహిళలకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించే చారిత్రాత్మక "మహిళా రిజర్వేషన్ బిల్లు" (నారీ శక్తి వందన్ అధినియం) ప్రవేశపెట్టిన సంగతి మనందరికీ తెలిసిందే. అయితే మహిళా అభ్యున్నతికి బాటలు వేసే ఈ మహోన్నత బిల్లు పట్ల కాంగ్రెస్.బిఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) పార్టీలు వ్యవహరించిన తీరు అత్యంత విచారకరం. మహిళలకు రాజకీయ అధికారం దక్కకూడదనే కుట్రతో, అభివృద్ధికి అడ్డుతగులుతూ మహిళా వ్యతిరేక వైఖరిని ఈ పార్టీలు అవలంబించాయని అన్నారు.మనం ఎందుకు ఆలోచించాలి?అవకాశాల నిరాకరణ మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం అంటే కోట్లాది మంది సోదరీమణుల రాజకీయ భవిష్యత్తును అడ్డుకోవడమే ద్వైపాక్షిక ధోరణి బయటకు మహిళా సంక్షేమం అని చెబుతూనే, పార్లమెంటులో బిల్లుకు వ్యతిరేకత చూపడం ఈ పార్టీల ద్వంద్వ నీతికి నిదర్శనం అభ్యున్నతికి ఆటంకం మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతుంటే సహించలేని పార్టీలు మనకు అవసరమా అని అన్నారు. కావున, మహిళా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలను మహిళా లోకమంతా ఏకతాటిపైకి వచ్చి బహిష్కరించాలని, మహిళా పక్షపాతి అయిన బీజేపీకి మద్దతు తెలపాలని కోరారు. మహిళలు రాజకీయంగా ఉన్నత పదవులు సాధించడానికి ఇతర రాజకీయ పార్టీలకు ఇష్టం లేదని స్పష్టమైంది అన్నారు.

# కవిత నూతన రాజకీయ ప్రస్థానం దిగ్విజయం కావాలి

**ఉమామహేశ్వరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన.**
**తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి.**

**మహేశ్వరం ఏప్రిల్ 19,(జనం వాయిస్):**

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, తెలంగాణ ఆడబిడ్డ కవితక్క ఈనెల 25వ తేదీన మేడ్చల్ వేదికగా ప్రకటించబోయే నూతన రాజకీయ పార్టీ ప్రజల ఆశీస్సులతో ప్రజాదరణ పొందాలని కోరుతూ, శ్రీశైలానికి ఉత్తర ద్వారంగా భాసించే ప్రసిద్ధ శైవక్షేత్రం నాగర్‌కర్నూల్ జిల్లా నలమల్ల పర్వతశ్రేణులలో ని ఉమా మహేశ్వరంలో ఆదివారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, రంగారెడ్డి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని, కవితక్క చేపట్టబోయే ఈ చారిత్రాత్మక నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో నవ శకానికి నాంది పలకాలని వారు ఆకాంక్షించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ"తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని విశ్వవ్యాప్తం చేసిన కవితక్క గారు, ఇప్పుడు ప్రజల పక్షాన పోరాడేందుకు రాజకీయాల్లోకి రావడం హర్షించదగ్గ పరిణామం. అమె అడుగులు ప్రజల కోసం అమే ఆరాటం ప్రజాసేవ కోసం అమే ఆశయం రాష్ట్ర అభివృద్ధి కొసం అని వారు అన్నారు ఈనెల 25న మేడ్చల్ లోని శ్రీ అద్వయ కన్వెన్షన్ (మునీరాబాద్) వేదికగా జరగబోయే పార్టీ ప్రకటన ఒక చారిత్రక ఘట్టం కాబోతోంది. ఈ నూతన పార్టీకి ప్రజల మద్దతు మెండుగా ఉండాలని, రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ పార్టీ ముందుకు సాగాలని వారు ఉమామహేశ్వరుని వేడుకున్నాము. తెలంగాణ భవిష్యత్తు కోసం కవితక్క గారు వేయబోయే ఈ ముందడుగును స్వాగతిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అభిమానులు, కార్యకర్తలు ఈ మహాత్కార్యంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.



దైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక RNI NO:TGTEL/26/A0383 WWW.JANAMVOICE.COM



# కురవి సంత అక్రమాలపై గుత్తేదారు నీళ్ల నమిలే సమాధానం..!

**అధిక వసూళ్లపై మౌనం..,
అధికారుల తదుపరి
చర్యలేమిటి.?
పాత రశీదుల వినియోగం
నిజమేనని అంగీకారం.
లక్షలల్లో వసూళ్లు చేసినట్లు
అనుమానం.
విచారణ జరిపి చర్యలు
తీసుకోవాలని రైతుల డిమాండ్.**







కురవి సంతలో గుత్తేదారు 'బరితెగింపు'

జిల్లా అధికారుల అండతోనే అక్రమ వసూళ్లు!.
నిబంధనలకు పాతర..
ఇష్టారాజ్యంగా ఫీజుల వసూలు.
నకిలీ రసీదులతో సామాన్యుల జేబులకు చిల్లు.
అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వార్డు సభ్యులు దైద భద్రయ్య.
గుత్తేదారి ఒక్కమేకకు రూ. 250 తీసుకున్నారు : రైతులు చిలకబత్తుల వెంకన్న, ఉప్పలయ్య.
గుత్తేదారులు తై బజారులో రసీదు ఎవ్వరికీవ్వాలె : వ్యాపారస్తులు.
గుత్తేదారికి నోటీసులు జారీ చేసిన కార్యదర్శి.

కురవి, ఏప్రిల్ 17 (జనం వాయిస్):
చారిత్రక నేపథ్యం ఉన్న మహబూబాబాద్ జిల్లా కురవి సంతలో గుత్తేదారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి, జిల్లా అధికారుల అండదండలతో సామాన్య రైతులు, చిరువ్యాపారుల నుండి భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సిన రుసుము కంటే రెట్టింపు వసూలు చేస్తూ గుత్తేదారు తన 'బరితెగింపు'ను చాటుకుంటున్నాడు.

అడ్డగోలు వసూళ్లు.. అడిగితే బెదిరింపులు!

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పశువుల అమ్మకంపై ఒక్కొక్కంటికి రూ. 300, గొర్రెలు/మేకలకు రూ. 200 వసూలు చేయాల్సి ఉండగా, అదనంగా మరో రూ. 100 వసూలు చేస్తున్నారు. ఇక తై బజార్‌లో చిరువ్యాపారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రూ. 30 నుంచి రూ. 50 వసూలు చేయాల్సిన చోట ఏకంగా రూ. 100 నుండి రూ. 250 వరకు దండుకుంటున్నారు. ఈ దోపిడీని ప్రశ్నిస్తే గుత్తేదారు అనుచరులు దౌర్జన్యానికి దిగుతున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా బాధ్యతల అప్పగింత..

సంత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే గుత్తేదారుకు అప్పగించాల్సి ఉండగా, గత పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా ముందే అప్పగించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. పశువులు దొంగిలించబడితే గుత్తేదారుదే బాధ్యత అని నిబంధనలు చెబుతున్నా, రసీదులపై మాత్రం "కొనుగోలుదారుదే బాధ్యత" అని ముద్రించి చేతులు దులుపుకుంటున్నారు.

నకిలీ రసీదుల దందా!

గ్రామ పంచాయతీ ముద్రించిన అధికారిక రసీదు బుక్కులను వాడాల్సి ఉండగా, గుత్తేదారు పాత బుక్కులను, నకిలీ బుక్కులను వాడుతూ అమాయక రైతులు, వ్యాపారుల నుండి అధికంగా దోచుకుంటున్నారు. కొన్ని రసీదుల్లో గుత్తేదారు సంతకం గానీ, కొనుగోలుదారు, అమ్మిన రైతు పేర్లు గానీ నమోదు చేయకపోవడం గమనార్హం. గత సోమవారం జరిగిన సంతలో అయితే అసలు రసీదులు కూడా ఇవ్వకుండానే వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం.

చర్యలకు వార్డు సభ్యుల డిమాండ్.

ఈ అక్రమాలపై జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో, వార్డు సభ్యులు దైద భద్రయ్య 'ప్రజాపాలన' సమావేశంలో అదనపు కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి గుత్తేదారుకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న గుత్తేదారు లైసెన్స్‌ను రద్దు చేయాలని వార్డు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

గుత్తేదారి మేకకు రూ. 250 తీసుకున్నారు : రైతులు చిలకబత్తుల వెంకన్న, ఉప్పలయ్య.

సుబ్బేదు గ్రామం నుండి కురవి సంతలో మేకను కొనడానికి వచ్చాము. ఒక్క మేకను కొనుగోలు చేశాము. నా దగ్గరనుండి రూ. 150, అమ్మిన రైతు నుండి రూ. 100 మొత్తం రూ. 250 గుత్తేదారి వసూల్లు చేశారు.

గుత్తేదారులు రసీదు ఎవ్వరికీవ్వాలె.

కురవి గత వారాంతపు సంతా తై బజార్ లో గుత్తేదారులు రసీదు రవ్వరికివ్వలేదని స్వయంగా గ్రామ పంచాయతీ సిబ్బంది అడుగుతే రసీదు ఇవ్వలేదని కూరగాయల వ్యాపారాలు చెప్పారు.

**కురవి, ఏప్రిల్ 19 (జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వారాంతపు పశువుల, తై బజార్ సంతలో సాగుతున్న అక్రమ వసూళ్ల పర్వం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న గుత్తేదారుకు పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేయగా, దానికి గుత్తేదారు ఇచ్చిన వివరణపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### తప్పు ఒప్పుకున్న గుత్తేదారు?

సంత రిజిస్ట్రేషన్ చేయకుండానే కార్యకలాపాలు సాగిస్తున్నట్లు, నకిలీ రశీదులతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై కార్యదర్శి ఇచ్చిన నోటీసులకు గుత్తేదారు స్పందించారు. మరో 10 రోజుల్లో సంత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని, ప్రస్తుతం రశీదు బుక్కులు అందుబాటులో లేకపోవడం వల్లనే పాత బుక్కులను వాడుతున్నామని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది. అంటే, నిబంధనలకు విరుద్ధంగా పాత రశీదులు వాడుతున్నట్లు గుత్తేదారు స్వయంగా అంగీకరించినట్లయింది.

### అధిక వసూళ్లపై దాటవేత ధోరణి

రిజిస్ట్రేషన్, రశీదుల విషయంలో సమాధానం చెప్పిన గుత్తేదారు.. గత రెండు వారాలుగా రైతుల నుండి, వ్యాపారుల నుండి వసూలు చేసిన 'అదనపు' బాదుడుపై మాత్రం నోరు మెదపకపోవడం గమనార్హం. గ్రామ పంచాయతీ పాలక మండలి నిర్ణయించిన దానికంటే రెట్టింపు ధరలు వసూలు చేస్తూ ఇప్పటికే లక్షల రూపాయలు అక్రమంగా ఆర్జించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ అధిక వసూళ్లపై గుత్తేదారు వివరణ ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

### అధికారులు స్పందించాలి..

కేవలం నోటీసులతో కాలయాపన చేయకుండా, గుత్తేదారు ఇప్పటివరకు వాడిన రశీదు బుక్కులను అధికారులు స్వాధీనం చేసుకోవాలని రైతులు కోరుతున్నారు. పాత రశీదుల పేరుతో ఎంత మేర వసూలు చేశారు? నిబంధనల ప్రకారం వసూళ్లు చేసిన వాటా ఎంత? అదనంగా వసూలు చేసిన సొమ్ము ఎంత? అనే విషయాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కురవి రైతులు, వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.
("జనం వాయిస్" కథనం 2)

# సబితా ఇంద్రా రెడ్డి ని సూటిగా ప్రశ్నిస్తున్నా

**ఎంతమంది అమాయకుల ప్రాణాలు ఏ కోల్పోయారో మీకు తెలియదా..?.
అప్పుడు మంత్రిగా ఉండి ఆ రోడ్ల విస్తరణ గురించి ఎందుకు పట్టించుకోలేదు?.
ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి.**

**మహేశ్వరం, ఏప్రిల్ 19,(జనం వాయిస్):**
మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ ప్రమాదాలు మీకు కనిపించడం లేదా? సబితమ్మ, బడంగ్‌పేట్ పరిధిలో రోడ్లు ఇరుగ్గా ఉండటం వల్ల గత కొన్నేళ్లుగా ఎన్ని ఘోర ప్రమాదాలు జరిగాయో, ఎంతమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారో మీకు తెలియదా? అప్పుడు మంత్రిగా ఉండి ఆ రోడ్ల విస్తరణ గురించి ఎందుకు పట్టించుకోలేదు? ప్రజల ప్రాణాల కంటే మీకు అక్రమ కట్టడాలే ముఖ్యమా? అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు రోడ్డు విస్తరణ అనేది ప్రజల ప్రాణాలను కాపాడటానికి, ట్రాఫిక్ సమస్యలను తీర్చడానికి చేస్తున్న పని. నాడు మీ హయాంలో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, నేడు జరుగుతున్న అభివృద్ధి పనులపై రాజకీయం చేయడం మీ స్థాయికి తగదు. అక్రమ కట్టడాల వల్ల జరిగే ప్రమాదాలకు బాధ్యత వహించాల్సింది పోయి, ఇలాంటి చౌకబారు విమర్శలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు.కమీషన్ల కోసం కళ్లు మూసుకుని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించిన చరిత్ర మీది. బడంగ్‌పేట్ రోడ్లపై జరుగుతున్న రక్తపాతానికి, ప్రమాదాలకు మీ నిర్లక్ష్యమే కారణం కాదా? ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను అడ్డుకోవడం మానుకోండి అని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి అన్నారు.



# కాసు బాగు భూ బాధితులకు అండగా

**మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.
కాసుబాగు భూముల్లో రైతులతో సహా పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్న సబితమ్మ.**





**మహేశ్వరం, ఏప్రిల్ 19,(జనం వాయిస్):**
మహేశ్వరం నియోజకవర్గంలోని నాదర్గుల్ ప్రాంతంలో జరుగుతున్న అన్యాయం చూసి మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసుబాగు (శివరాజ్ బహదూర్) భూముల విషయంలో సంవత్సరాలుగా కొనసాగుతున్న పోరాటంపై ఆమె స్పందించారు. కాసుబాగు భూముల్లో రైతులతో సహా పర్యటించి అక్కడ ఎండిన పంటలను, వ్యవసాయం కోసం ఉపయోగించిన బోర్లను లోపట ఉన్న కుంటను పరిశీలించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలోనే నారా చంద్రబాబు నాయుడు హయాంలో ఈ అంశం ప్రస్తావనకు రాగా, అనంతరం స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు ఈ భూములను స్పష్టంగా ప్రభుత్వ భూములుగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ వివాదంపై కోర్టులు కూడా స్పష్టత ఇచ్చినట్టు ఆమె పేర్కొన్నారు. హైకోర్ట్ సింగిల్ బెంచ్, డబుల్ బెంచ్ రెండూ ఈ భూములు ప్రభుత్వానికి చెందినవేనని చెప్పినప్పటికీ, ప్రస్తుతం సుప్రీం కోర్టులో కేసు కొనసాగుతుందని తెలిపారు. "ప్రభుత్వం చెబుతోంది కోర్టులు చెబుతున్నాయని అయితే ఇక్కడ ప్రైవేట్ వాళ్లు ఎవరు? ఎవరికి ధైర్యం ఇచ్చారు? ఎవరి అండతో రైతులను భయపెడుతున్నారు?" అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు.సుమారు 375 ఎకరాల భూమి, 600కి పైగా రైతు కుటుంబాలు ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రతి కుటుంబం 1 నుంచి 3 ఎకరాల వరకు సాగు చేసుకుంటున్నాయని చెప్పారు.రైతులను వారి భూముల్లోకి వెళ్లనివ్వకుండా సెక్యూరిటీ ఏర్పాటు చేసి అడ్డుకోవడం తీవ్ర అన్యాయమని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆమె మండిపడ్డారు. మంత్రులు, కలెక్టర్ కూడా ఇవి ప్రభుత్వ భూములేనని చెబుతున్నప్పటికీ, ఇప్పటికీ చర్యలు లేకపోవడం ఆశ్చర్యకరమని విమర్శించారు.

### ప్రభుత్వానికి ఎమ్మెల్యే డిమాండ్లు:

అక్రమంగా వేసిన రేకులను వెంటనే తొలగించాలి. రైతులకు తమ భూముల్లో వ్యవసాయం చేసుకునే అవకాశం కల్పించాలి తక్షణమే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి ఇంకో నెలలో వర్షాకాలం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో రైతులను అడ్డుకోవడం అంటే వారి జీవనాధారాన్ని దెబ్బతీయడమే" అని ఆమె అన్నారు.ప్రజల కోసం పని చేసే ప్రభుత్వం అయితే వెంటనే స్పందించాలని, రైతుల పక్షాన నిలబడాలని ఆమె డిమాండ్ చేశారు. లేదంటే రైతుల కోసం వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తామని హెచ్చరించారు."రైతు బతికితేనే దేశం బతుకుతుందిడ రైతు గెలిస్తేనే న్యాయం గెలుస్తుంది అని ఘాటుగా స్పందించారు.అంతేకాకుండా, కాసుబాగు భూ బాధితుల పోరాటానికి పూర్తి మద్దతు తెలుపుతూ, న్యాయపరంగా, చట్టపరంగా అన్ని విధాల సహకరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాదర్గుల్ ప్రాంతానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు , కార్యకర్తలు, కాసుబాగు భూ బాధితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

**జవహర్ నగర్ ఏప్రిల్ 19 (జనం వాయిస్):**
మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ అంబేద్కర్ నగర్ రాయన్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (రిజిస్ట్రేషన్ నెంబర్: 252/2005) నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం కాలనీవాసుల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్లు సభ్యులు ప్రకటించారు.నూతన కార్యవర్గ వివరాలు వెల్లడించారు.నూతన అధ్యక్షుడిగాకె. ఉప్పలయ్య ప్రధాన కార్యదర్శిగా శాగంటి వెంకటేష్ , కోశాధికారిగా దువాసి దుర్గాప్రసాద్, గౌరవ అధ్యక్షులు తూర్పుగొండ రామన్న, ఆర్కే బాబు, వెంకటేష్ గౌడ్, మాడుగుల విజయ్ సలహాదారులు ఎం. ఆనంద్, పి. రమేష్ ఉపాధ్యక్షులు డి.కె. దేవేందర్, జి. రమేష్ సంయుక్త కార్యదర్శులు హరిబాబు, మహంకాళి వెంకటేష్, సంగి పరమేష్ రామచందర్, అంజయ్య, జాన్, దుర్గేష్, రాజ్ కుమార్, సిహెచ్ రాములు, కుమార్ గౌడ్, నాగరాజు గౌడ్, రామస్వామి, రాజు, శీను, కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కె. ఉప్పలయ్య మాట్లాడుతూ.. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు, డ్రైనేజీ తాగునీటి సమస్యల పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. కాలనీ వాసులందరినీ సమన్వయం చేసుకుంటూ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతామని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పేర్కొన్నారు.కొత్తగా ఎన్నికైన సభ్యులను కాలనీ వాసులు అభినందించారు.



# కార్మికుల కష్టార్జితంపై 'మీ సేవ' కన్ను.

- **అధికారుల అండతో అక్రమ వసూళ్ల పర్వం.?**
- **లేబర్ కార్డు మంజూరులో కుమ్మక్కు రాజకీయాలు.**
- **నిబంధనలకు విరుద్ధంగా వందల రూపాయల దోపిడీ.**




**జనం వాయిస్, గోదావరిఖని, ఏప్రిల్ 19:**
రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కార్మికుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అక్రమార్కుల పాలిట వరంగా మారుతున్నాయి. భవన నిర్మాణ కార్మికులకు భరోసా కల్పించాల్సిన 'లేబర్ కార్డు' మంజూరు ప్రక్రియ ఇప్పుడు అక్రమ వసూళ్లకు అడ్డాగా మారింది. గోదావరిఖని లోని కొన్ని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, కార్మిక శాఖ అధికారులు కుమ్మక్కై సామాన్య కార్మికులను నిలువునా దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### నిబంధనలు గాలికి..వసూళ్లే లక్ష్యం.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేబర్ కార్డు నమోదుకు నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేయాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. దరఖాస్తు ప్రక్రియ నుంచి కార్డు చేతికి వచ్చే వరకు ఒక్కో కార్మికుడి నుండి 1000 రూపాయల నుండి 1500 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. "డబ్బులు ఇస్తేనే ఫైల్ ముందుకు కదులుతుంది.. లేదంటే అబ్జెక్షన్ పెడతాం" అంటూ మీ సేవ నిర్వాహకులు బాహాటంగానే చెబుతున్నట్టు సమాచారం.

### అధికారుల 'కుమ్మక్కు' మాయాజాలం.

ఈ అక్రమ దందాలో కార్మిక శాఖ అధికారుల పాత్రపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మీ సేవ కేంద్రాల ద్వారా వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదించాల్సిన అధికారులు, కేవలం 'కమిషన్లు' అందిన ఫైళ్లను మాత్రమే క్లియర్ చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. అర్హత ఉన్నా సరే, పైసలు ఇవ్వని వారి దరఖాస్తులను వారాల తరబడి పెండింగ్‌లో ఉంచుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

### ప్రశ్నిస్తే వేధింపులు.

వసూళ్లపై ఎవరైనా కార్మికులు ధిక్కరిస్తే, వారి దరఖాస్తుల్లో సాంకేతిక లోపాలున్నాయని సాకులు చెబుతూ తిరస్కరిస్తున్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే కూలీలకు ఈ ప్రక్రియపై సరైన అవగాహన లేకపోవడాన్ని అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

### కార్మికుల డిమాండ్:

నిరుపేదల శ్రమను దోచుకుంటున్న మీ సేవ కేంద్రాల లైసెన్సులను రద్దు చేయాలని, అవినీతికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# అణగారిన వర్గాల హక్కుల కోసం కాళ్లకు గజ్జెలు కట్టిన కళా ప్రపూర్ణుడు గజ్జెల రామచందర్.

**పల్లె పల్లెకు తిరుగుతూ ప్రజలను చైతన్యవంతులను చేసిన ధీరుడు.
జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కల్లేపల్లి సదానందం.**

**జవహర్ నగర్ ఏప్రిల్ 19 (జనం వాయిస్):**
అణగారిన వర్గాల హక్కుల కోసం కాళ్లకు గజ్జెలు కట్టిన కళా ప్రపూర్ణుడు పల్లె పల్లెకు తిరుగుతూ ప్రజలను చైతన్యవంతులను చేసిన ధీరుడు జవహర్ నగర్ ముద్దుబిడ్డ మన గజ్జల రామచంద్ర. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కల్లేపల్లి సదానందం పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ వాసి అయిన రామచందర్ కాళ్లకు గజ్జలు కట్టి భుజాన గొంగడి వేసుకుని గళం విప్పి ప్రతి పల్లె పల్లెకు తిరుగుతూ ప్రజలను చైతన్యపరిచిన ఆయన అనగారిన వర్గాల హక్కుల కోసం జరిగే. ఉద్యమ వేదికలపై పాటల ద్వారా విశేషమైన ప్రదర్శనలు పీడత తాడిత ప్రజానికానికి సేవకులు అందించిన పాటల కళాకారుడు గజ్జల రామచందర్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాబు జగ్జీవన్ రావు జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్ బాబు కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరుశురామ్ చేతుల మీదుగా రవీంద్ర భారతిలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి సదానందం తదితరులు ఆదివారం రామచందర్ ను ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కల్లేపల్లి సదానందం మాట్లాడుతూ గజ్జల రామచందర్ చిన్ననాటి నుండి కుల వివక్షతను దళితులపై దాడులు గుడిసె వాసులకు పట్టాల కోసం కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వంటి అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొన్నారు అని తెలిపారు. కాళ్లకు గజ్జలు



కట్టి భుజాన గొంగడి వేసుకుని గళం విప్పి ప్రతి పల్లె పల్లెకు తిరుగుతూ ప్రజలను చైతన్యపరిచిన ఆయన అనగారిన హక్కుల కోసం జరిగే ఉద్యమ వేదికలపై పాటల ద్వారా విశేషమైన ప్రదర్శనలు పీడిత తాడిత ప్రజానీకానికి సేవలు అందించాడన్నారు. రామచందర్ కు ఈ అవార్డు రావడం యావత్ కళారంగానికి దక్కిన గౌరవం అన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, గబ్బిలాల పేట వ్యవస్థాపకులు తురుగొండ రామన్న, బల్లి శ్రీనివాస్ గుప్తా, మాజీ కార్పొరేటర్ పుతాడి సాయి, కవి కానుగంటి వెంకటేష్, చింతల శ్రీనివాస్, భైరపాక బెంజిమెన్, పానుగంటి కుమార్, పల్లెర్ల వెంకటేష్, రాపాక రామ్ నరసయ్య, నల్ల ప్రభాకర్, రాజమౌళి, నరసింహ, చుక్క ఉప్పలయ్య, అంద శ్రీను, కొడిమాల శ్రీను, కందుల వసంత, మహేశ్వరి, మల్లేష్, రాళ్ల బండి సదానందం, బస్తీ ప్రజలకు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మట్టి అక్రమాలపై కరువైన రెవెన్యూ నిఘా

**జనం వాయిస్, మంథని:**
మట్టి మాఫియా దందా జోరుగా సాగుతుంది అనుమతులు లేకపోయినా, పరిమితికి మించి తవ్వకాలు జరుపుతూ, అక్రమంగా మట్టిని తరలిస్తూ పర్యావరణానికి, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. మంథని లో మట్టి మాఫియా అక్రమ మట్టి తరలించడంలో ప్రతి ఆదివారం ఒక రూటు మార్చుతుంది గత వారం గాడుదల గండి సమీపంలో అడవిలోని ఎర్రమట్టిని అక్రమంగా తరలించిన మాఫియా ఈ ఆదివారం బిట్టుపల్లి,రచ్చపల్లి శివారులోని ఎర్ర మట్టిని తరలించడంలో తమ కొత్త వ్యూహాన్ని అనుసరించారు సంబంధిత అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూముల నుండి సైతం ఎర్రమట్టిని అక్రమంగా తరలించడం జరిగింది గత రెండు వారాలుగా మంథనిలో అక్రమ మట్టి రవాణా కొనసాగుతున్న విషయం పలు పత్రికల ద్వారా రెవెన్యూ అధికారులకు చేరినప్పటికిని రెవెన్యూ అధికారులు స్థానికంగా ఉండకపోవడం వలన అక్రమ మట్టి వ్యాపారస్తులు అదును చూసుకొని ఆదివారం వేళ మట్టిని అక్రమంగా తరలించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. మంథనిలోని పలు గ్రామాల్లో నూతన గృహ నిర్మాణాలకు,ప్రభుత్వ కార్యాలయాల పనులకు యదేచ్ఛగా అక్రమ మట్టిని తరలిస్తూ రోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి ఒక్కో ట్రాక్టర్ కు వెయ్యి నుండి పన్నెండు వందల వరకు తీసుకొని లక్షల గడిస్తున్నారు. అక్రమ మట్టి దందాకు ఎలాంటి అనుమతులు లేకుండానే గుత్తేదారులు అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు.ఈ విషయం పై సంబంధిత రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినప్పటికీని అధికారులు స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం ఇప్పటికైనా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యం ఉందనడంలో సందేహం లేదు. మండల తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో అక్రమ మట్టి దందా నడుస్తున్న అధికారులకు సమాచారం అందించినప్పటికీని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది గానీ ఆర్డీవో కార్యాలయ సిబ్బంది గానీ స్పందించకపోవడం చాలా బాధాకరం. ఈ అక్రమ మట్టి రవాణాను సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోని అక్రమ మట్టి రవాణా చేస్తున్న మట్టి మాఫియా పై చర్యలు తీసుకోకుంటే రెవెన్యూ అధికారుల పై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్న వారి పై చర్యలు తీసుకొని అక్రమ మట్టి రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్లను జెసిబిలను వెంటనే సీజ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేసాడు.



RNI NO:TGTEL/26/A0383
దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# అన్న క్యాంటీన్లకు భారీ విరాళం

**పేదల కడుపు నింపే సేవకు భువనేశ్వరి మద్దతు.**
**చంద్రబాబు జన్మదినం సందర్భంగా రూ.76 లక్షల విరాళం.**
**రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లలో ఉచిత భోజనం.**
**అన్నదానం మహోన్నత సేవగా కొనియాడిన నేతలు.**



**జనం వాయిస్, అమరావతి, ఏప్రిల్ 19:**
రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న అన్న క్యాంటీన్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్ధాంగి నారా భువనేశ్వరి భారీ విరాళాన్ని ప్రకటించారు. రేపు (ఏప్రిల్ 20) ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని రూ.76 లక్షలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ విరాళంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం అందించనున్నారు. శనివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో అన్న క్యాంటీన్ సీఈవోకు చెక్కును భువనేశ్వరి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లక్షలాది పేదల కడుపు నింపే ఈ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. కేవలం రూ.5కు పరిశుభ్రమైన వాతావరణంలో గౌరవంగా భోజనం అందించడం అభినందనీయమని తెలిపారు. రోజువారీ కూలీలు, నిరుపేదలు ఈ పథకం ద్వారా విశేషంగా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా మించిన సంతృప్తి లేదని ఆమె అన్నారు. తాను పలు సందర్భాల్లో అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు కలిగిన అనుభూతిని గుర్తుచేసుకున్నారు. తమ మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా గత 12 ఏళ్లుగా తిరుమల అన్నప్రసాదానికి ప్రతి ఏడాది రూ.44 లక్షలు విరాళంగా ఇస్తున్న విషయాన్ని వెల్లడించారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఈ విరాళం ఇవ్వడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. ఇక ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, అన్నదానాన్ని ఒక గొప్ప యజ్ఞంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. తిరుమలలో భక్తుల సహకారంతో దశాబ్దాలుగా జరుగుతున్న అన్నదానాన్ని ఆదర్శంగా తీసుకుని అన్న క్యాంటీన్ల సేవలను మరింత విస్తరించాలని అన్నారు. ప్రజలు పుట్టినరోజులు, పెళ్లిరోజులు వంటి ప్రత్యేక సందర్భాల్లో విరాళాలు అందించి ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# సింహాచలం చందనోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

**భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి.**
**రెండు లక్షల మంది భక్తుల రాకకు అంచనా.**
**భద్రత, వైద్య సదుపాయాలపై కట్టుదిట్టమైన చర్యలు.**
**ప్రత్యేక పర్యవేక్షణతో సాఫీ దర్శనాలు లక్ష్యం.**
**రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత.**



**జనం వాయిస్, విశాఖపట్నం, ఏప్రిల్ 19:**
విశాఖపట్నంలోని సింహాచలం దేవస్థానంలో జరగనున్న చందనోత్సవం సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రేపటి కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులు, పోలీసులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ ఏడాది సుమారు రెండు లక్షల మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివస్తారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, సామాన్య భక్తులకు ప్రాధాన్యతనిస్తూ దర్శనాలు సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. భక్తుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, తాగునీరు, మజ్జిగ పంపిణీకి చర్యలు తీసుకున్నారు. వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విశ్రాంతి కేంద్రాలు కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. వాహనాల రాకపోకలను సక్రమంగా నియంత్రించేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేస్తున్నారు. అవసరమైతే అత్యవసర సేవల బృందాలు వెంటనే స్పందించేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. భద్రతా పరంగా కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆధునిక సాంకేతిక పద్ధతులతో పర్యవేక్షణ కొనసాగిస్తూ, ప్రతి క్షణం పరిస్థితిని గమనించే విధంగా నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. భక్తులు శాంతియుతంగా, క్రమశిక్షణతో దర్శనానికి సహకరించాలని కోరారు. ఈ చందనోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

# హామీ నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

**చిరువ్యాపారి కుటుంబానికి మూడు సాయాలు.**
**ఇంటి స్థలం, రుణం, పింఛన్ మంజూరు.**
**విజయవాడ పర్యటనలో ఇచ్చిన మాట నెరవేర్పు.**
**ఇతర లబ్ధిదారులకు కూడా వరుసగా సాయం.**



**జనం వాయిస్, అమరావతి, ఏప్రిల్ 19:**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ విజయవాడకు చెందిన చిరువ్యాపారి సీహెచ్ దుర్గారావు కుటుంబానికి మూడు కీలక సాయాలు అందించబడ్డాయి. 2025 అక్టోబర్ 20న విజయవాడలో జరిగిన కార్యక్రమంలో దుర్గారావు సమస్యలను స్వయంగా తెలుసుకున్న సీఎం, ఇంటి స్థలం, వ్యాపార రుణం, పింఛన్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తాజాగా ఈ మూడు సాయాలు అమలులోకి వచ్చాయి. దుర్గారావు అనారోగ్య కారణంగా ఒక కాలు కోల్పోయి జీవనోపాధి కష్టాల్లో ఉన్నట్లు సీఎం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారం కొనసాగించేందుకు ఆర్థిక సాయం, అలాగే నివాస స్థలం కల్పించాలని కోరగా, సీఎం వెంటనే సానుకూలంగా స్పందించారు. హామీ ప్రకారం ఆయన భార్య కృష్ణవేణి పేరుతో ఇంటి స్థలం కేటాయించి అధికారులు పట్టా అందజేశారు. అదే విధంగా వ్యాపారం కోసం అవసరమైన ముద్ర రుణంగా రూ.30 వేల మొత్తాన్ని దుర్గారావు ఖాతాలో జమ చేశారు. అంతేకాకుండా ఈ నెల నుంచి పింఛన్ కూడా మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. తక్కువ సమయంలోనే మూడు సాయాలు అందడంతో దుర్గారావు కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. దుర్గారావు మాట్లాడుతూ, సీఎం తమ పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తాను, తన కుటుంబం సీఎం చేసిన సాయానికి ఎప్పటికీ రుణపడి ఉంటామని చెప్పారు. ఈ సాయం తమ జీవితానికి పెద్ద మద్దతుగా నిలిచిందని పేర్కొన్నారు. ఇదే తరహాలో గతంలో కూడా పలువురికి సీఎం సాయం అందించారు. పల్నాడు జిల్లాలో ఉల్లంగుల ఏడుకొండలు అనే వ్యక్తికి కొత్త గాలి యంత్రం అందించగా, ఆయన జీవనోపాధి మెరుగుపడింది. అలాగే ఇతర ప్రాంతాల్లో కూడా సమస్యలు చెప్పిన వారికి తక్షణ సాయం అందించిన ఉదాహరణలు ఉన్నాయి. మొత్తానికి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో సీఎం ముందుండి పనిచేస్తున్నారని ఈ ఘటనలు స్పష్టంగా చూపిస్తున్నాయి. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వెంటనే పరిష్కారం చూపడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై షర్మిల ఘాటు విమర్శలు

**రిజర్వేషన్ల అమలుపై ప్రశ్నలు.**
**డీలిమిటేషన్‌తో లింక్‌పై అభ్యంతరం.**
**తక్షణ అమలుకు కాంగ్రెస్ డిమాండ్.**

**జనం వాయిస్, అమరావతి, ఏప్రిల్ 19:**
మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలులో ఆలస్యం చేయడం ద్వారా మోదీ అసలు ఉద్దేశం బయటపడిందని ఆరోపించారు. నారీశక్తి పేరిట రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నారని విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో స్పందించిన షర్మిల, 2023లో పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమలు చేయకుండా, నియోజకవర్గాల పునర్విభజనతో అనుసంధానం చేయడం ఎందుకని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని చెప్పడం రాజకీయ నాటకమని ఆరోపించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలన్నారు. మహిళల ఆత్మగౌరవంపై నిజమైన నిబద్ధత ఉంటే చట్టాన్ని వెంటనే అమలు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న 543 పార్లమెంట్ స్థానాల్లోనే రిజర్వేషన్లు అమలు చేయవచ్చని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాన్ని వెల్లడించారు. డీలిమిటేషన్‌తో దీనికి సంబంధం లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ శాస్త్రీయంగా జరగాలని ఆమె అభిప్రాయపడ్డారు. ముందుగా జనాభా లెక్కలు, కులగణన పూర్తి చేసి, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని షర్మిల ఆరోపించారు. రాష్ట్రాల సమైక్యతకు భంగం కలిగించే ప్రయత్నాలను విపక్షాలు అడ్డుకుంటాయని హెచ్చరించారు. మహిళలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం సరికాదన్నారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ప్రధాని మోదీకి షర్మిల సవాల్ విసిరారు. పారదర్శకంగా, న్యాయబద్ధంగా పునర్విభజన చేపట్టాలని డిమాండ్ చేశారు. 2029 ఎన్నికలలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆమె కోరారు.



# తెనాలిలో వెలుగులోకి ఆన్‌లైన్ అశ్లీల కాల్స్ రాకెట్

**ప్రత్యేక పోర్టల్ ద్వారా చాటింగ్, వీడియో కాల్స్.**
**మహిళలను వలలో వేసిన యువకుడు సూత్రధారి.**
**పోలీసుల దర్యాప్తులో సంచలన వివరాలు.**



**జనం వాయిస్, తెనాలి, ఏప్రిల్ 19:**
తెనాలి పట్టణంలో ఆన్‌లైన్ అశ్లీల కాల్స్, చాటింగ్ వ్యవహారం బయటపడటం కలకలం రేపింది. ప్రత్యేకంగా రూపొందించిన ఒక పోర్టల్ ద్వారా మహిళలతో అశ్లీల చాటింగ్, వీడియో కాల్స్ నిర్వహిస్తున్న రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు మహిళలను గుర్తించిన పోలీసులు, అసలు సూత్రధారి ఒక యువకుడని నిర్ధారించారు. తెనాలి చెంచుపేట, పాండురంగపురం ప్రాంతాలకు చెందిన మధ్యవయస్కులైన మహిళలు ఈ కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు దర్యాప్తులో తేలింది. “స్ట్రిప్ టాక్” పేరుతో నడుస్తున్న ఈ పోర్టల్ ద్వారా డబ్బులు చెల్లించిన వారికి అశ్లీల సేవలు అందిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఎక్కడి నుంచైనా కనెక్ట్ అయ్యేలా ఈ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారం పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుండటంతో మహిళలు స్వయంగా నిర్వహించడం సాధ్యం కాదని భావించిన పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. విచారణలో మహిళల్లో ఒకరి కుమారుడు సాయి ఈ రాకెట్‌కు సూత్రధారి అని బయటపడింది. డబ్బుల కోసం మరికొంతమంది మహిళలను కూడా ఈ నెట్‌వర్క్‌లోకి దింపినట్లు గుర్తించారు. దాదాపు వందమంది వరకు మహిళలు ఈ రాకెట్‌లో భాగమై ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆ మహిళల ఇళ్లకు తరచుగా కొత్త వ్యక్తులు రాకపోకలు సాగించడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఈ కేసును తెనాలి త్రీ టౌన్ పోలీసు అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆన్‌లైన్ పోర్టల్ వివరాలను సేకరించి, అందులో కనిపించిన మహిళలను గుర్తించి విచారణ జరిపారు. కీలక ఆధారాలను సేకరించి కేసును ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు సాయి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని బ్యాంక్ ఖాతాలు, ఫోన్ నంబర్లు, ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మహిళలను బాధితులుగా పరిగణించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుని పూర్తి వివరాలు వెలుగులోకి తీసుకువస్తామని పోలీసులు వెల్లడించారు.

# పవన్ కళ్యాణ్ ఆరోగ్యం గురించి ప్రధాని మోదీ ఆరా



**జనం వాయిస్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్‌లో ఆరా తీశారు. ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కళ్యాణ్ పరిస్థితిని తెలుసుకుంటూ ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు. ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ సామాజిక మాధ్యమంలో స్పందిస్తూ, “పవన్ కళ్యాణ్ గారు ఎంతో ధైర్యవంతుడు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను” అని పేర్కొన్నారు. ఈ సందేశం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని చూపిన ఆప్యాయతకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. తన ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికి సమయం కేటాయించి మాట్లాడినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. తన ఆరోగ్యం పట్ల చూపిన ఆందోళన, శుభాకాంక్షలు తనకు ఎంతో బలం ఇస్తున్నాయని చెప్పారు. “మీ మార్గదర్శకత్వం, మద్దతుకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడనై ఉంటాను” అని పవన్ తన స్పందనలో పేర్కొన్నారు. త్వరలోనే పూర్తిగా కోలుకుని ప్రజాసేవలోకి తిరిగి వస్తానని తెలిపారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ పరిణామంతో పలువురు కేంద్ర, రాష్ట్ర నాయకులు కూడా పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కుదుటపడాలని కోరుకుంటున్నారు. రాజకీయ భేదాలు పక్కనబెట్టి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మొత్తానికి ప్రముఖ నేత ఆరోగ్యం పట్ల దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతుండగా, ప్రధాని మోదీ స్వయంగా మాట్లాడటం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని తన విధుల్లోకి చేరాలని అందరూ ఆశిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ కు శస్త్రచికిత్స విజయవంతం

**ఆరోగ్యం కుదుటపడుతోంది.**
**అపోలో ఆసుపత్రిలో విజయవంతమైన చికిత్స.**
**నేతలు, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువ.**
**త్వరలోనే ప్రజాసేవలోకి వస్తానన్న ఉప ముఖ్యమంత్రి.**



**జనం వాయిస్, హైదరాబాద్, ఏప్రిల్ 19:**
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తాను క్రమంగా కోలుకుంటున్నానని వెల్లడించారు. హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో ఇటీవల జరిగిన శస్త్రచికిత్స విజయవంతమైందని తెలిపారు. సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్న ఆయనకు వైద్యులు విజయవంతంగా చికిత్స అందించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. శస్త్రచికిత్స అనంతరం తన ఆరోగ్యం కోసం ప్రార్థించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులు, అభిమానులకు పవన్ కళ్యాణ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పలువురు నేతల సందేశాలకు స్పందిస్తూ, తాను త్వరగా కోలుకుంటున్నానని స్పష్టం చేశారు. ప్రజల ప్రేమ, ఆశీస్సులు తనకు పెద్ద బలం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోదరుడు, సినీ నటుడు చిరంజీవి కూడా స్పందించారు. వైద్య ప్రక్రియ విజయవంతమైందని, ప్రస్తుతం పవన్ కళ్యాణ్ క్షేమంగా కోలుకుంటున్నారని తెలిపారు. వైద్యుల సూచనల మేరకు వారం రోజుల విశ్రాంతి తీసుకున్న తర్వాత సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి వస్తారని చెప్పారు. దీనికి స్పందించిన పవన్ కళ్యాణ్, తన అన్నయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. “మీ ప్రేమ, ఆశీస్సులు నాకు బలాన్నిస్తాయి. త్వరలోనే పూర్తిగా కోలుకుని ప్రజాసేవలోకి తిరిగి వస్తాను” అని పేర్కొన్నారు. మరో సోదరుడు నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకులు కూడా పవన్ ఆరోగ్యం కుదుటపడాలని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు కూడా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మొత్తానికి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడంతో పవన్ కళ్యాణ్ ఆరోగ్యం స్థిరంగా ఉంది. పూర్తి విశ్రాంతి అనంతరం త్వరలోనే తన విధుల్లోకి చేరి ప్రజాసేవను కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు. అభిమానులు, నాయకుల ఆశీస్సులతో త్వరితగతిన కోలుకుంటున్నట్లు జనసేన వర్గాలు వెల్లడించాయి.

# వ్యవసాయంలో మహిళలకు కొత్త దిశ..

## గోద్రెజ్ 'దిశ' కార్యక్రమం ప్రారంభం!

భారతీయ వ్యవసాయ రంగంలో మహిళల పాత్రను శ్రామికుల స్థాయి నుంచి నిర్ణయాధికారులు, నిపుణుల స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో గోద్రెజ్ అగ్రోవెట్ 'దిశ' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. మూడవ 'ఉమెన్ ఇన్ అగ్రికల్చర్ సమ్మిట్' వేదికగా ఈ కెరీర్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌ను ప్రకటించారు. బీఎస్సీ అగ్రికల్చర్ మరియు అనుబంధ విభాగాల్లో చదువుతున్న విద్యార్థినుల కోసం రూపొందించిన ఈ కార్యక్రమం, సాధారణ విద్యతో పాటు కార్పొరేట్ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను అందించే "ఫినిషింగ్ స్కూల్"లా పనిచేస్తోంది. 1వీ1దీ మరియు ఇక్యా లెర్నింగ్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఈ శిక్షణ అందిస్తున్నారు.

### క్యాంపస్ నుంచి కార్పొరేట్ వరకు మార్గదర్శనం

ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం 'క్యాంపస్-టు-కార్పొరేట్' అంతరాన్ని తగ్గించడం. వ్యవసాయ విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ, సేల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు ప్రొఫెషనల్ రెడీనెస్ లో లోపాలను గుర్తించిన సంస్థ, వాటిపై ప్రత్యేక శిక్షణ అందిస్తోంది.

ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని 276 మంది మహిళలు ఈ ప్రోగ్రామ్ ద్వారా లాభపడ్డారు. వీరిలో 33 శాతం మంది ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొందడం ఈ కార్యక్రమం విజయాన్ని సూచిస్తోంది. నియామక ప్రక్రియల నుంచి నాయకత్వ లక్షణాల వరకు ప్రతి దశలోనూ ఈ ప్రోగ్రామ్ వారికి అండగా నిలుస్తోంది.

### లక్ష మంది మహిళల లక్ష్యం

గోద్రెజ్ అగ్రోవెట్, వ్యవసాయ రంగంలో ఒక కోటి మంది మహిళలను ప్రభావితం చేయాలనే దీర్ఘకాలిక లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మొదటిగా లక్ష మంది మహిళలకు నేరుగా మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే స్కాలర్‌షిప్‌లు, నైపుణ్య శిక్షణ, నాయకత్వ వికాస కార్యక్రమాల ద్వారా సుమారు 63,300 మంది మహిళలకు చేరువైంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వ్యవసాయ రంగంలో మహిళలకు సరైన అవకాశాలు కల్పిస్తే దేశ అభివృద్ధి మరింత వేగంగా సాధ్యమవుతుందని సంస్థ అభిప్రాయపడుతోంది. భవిష్యత్తులో 'దిశ' కార్యక్రమాన్ని మరిన్ని రాష్ట్రాలకు విస్తరించనున్నట్లు వెల్లడించింది.

# ఆకాశాన్నంటిన నిమ్మకాయల ధరలు

ఆంధ్రప్రదేశ్‌లో నిమ్మకాయల ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగి సామాన్యులను షాక్‌కు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా గూడూరు మార్కెట్‌లో నిమ్మ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం 50 కేజీల నిమ్మ బస్తా ధర ఏకంగా రూ.10,000 వరకు పలుకుతోంది.

### కిలో ధర రూ.200 దాటింది

గత వారం వరకు కిలో నిమ్మకాయలు రూ.130 నుంచి రూ.150 మధ్య ఉండగా, ఇప్పుడు రూ.200 మార్కును దాటాయి. వేసవి ఎండలు పెరగడంతో ప్రజలు నిమ్మరసం వంటి పానీయాల వినియోగం పెంచడం వల్ల డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది.

### దిగుబడి తగ్గుదలే ప్రధాన కారణం

వ్యాపారుల సమాచారం ప్రకారం, ఈ ఏడాది నిమ్మ దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల మార్కెట్‌కు సరఫరా తగ్గింది. ఒకవైపు డిమాండ్ పెరగడం, మరోవైపు సరఫరా తగ్గిపోవడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా మారాయి. ఈ పరిస్థితిలో నిమ్మ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



# బంగారం ధరలు ఎలా ఉన్నాయి?

భారతీయ సంస్కృతిలో అక్షయ తృతీయకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఈ రోజున బంగారం కొనుగోలు చేస్తే ఐశ్వర్యం పెరుగుతుందని విశ్వాసం. ఇదిలా ఉంటే, ఈ పండుగ రోజున దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ రోజు ఉదయం సమాచారం ప్రకారం హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,780గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,42,800గా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,930గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,42,950గా ఉంది. అలాగే చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ.1,56,660గా, 22 క్యారెట్ల బంగారం రూ.1,43,600గా కొనసాగుతోంది. మరోవైపు వెండి ధరలు కూడా పెద్దగా మార్పులేకుండా కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.80 లక్షలుగా ఉండగా, ఢిల్లీలో రూ.2.75 లక్షలు, చెన్నైలో రూ.2.80 లక్షలు, బెంగళూరులో రూ.2.75 లక్షలుగా ఉన్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, పెరుగుతున్న డిమాండ్ ప్రభావంతో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నప్పటికీ, అక్షయ తృతీయ సందర్భంగా కొనుగోళ్లు మాత్రం జోరుగా సాగుతున్నాయి. మార్కెట్ వర్గాల అంచనాల ప్రకారం రాబోయే రోజుల్లో ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.



# టాటా కార్ యజమానులకు గుడ్‌న్యూస్




టాటా కార్లను ఉపయోగిస్తున్న వారికి టాటా మోటార్స్ అదిరిపోయే ఆఫర్ ప్రకటించింది. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా 'స్పెషల్ సమ్మర్ చెకప్ క్యాంప్'ను నిర్వహిస్తోంది. ఈ క్యాంప్ ఏప్రిల్ 28, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, వినియోగదారుల కార్లలోని సుమారు 30 కీలక భాగాలను పూర్తిగా ఉచితంగా తనిఖీ చేస్తారు. దీనికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వల్ల కార్ల పనితీరు తగ్గకుండా ఉండేందుకు ఈ చెకప్ క్యాంప్ ఎంతో ఉపయోగపడనుంది. ఈ చెకప్‌లో ఏసీ పనితీరు, బ్యాటరీ స్థితి, టైర్ల పరిస్థితి, వీల్ అలైన్‌మెంట్, ఇంజిన్ ఆయిల్, కూలెంట్ స్థాయిలు, ఎలక్ట్రికల్ సిస్టమ్స్ వంటి ముఖ్యమైన అంశాలను పరిశీలిస్తారు. అలాగే సీఎన్జీ వాహనాలు, ఎలక్ట్రిక్ వాహనాల కోసం ప్రత్యేక డయాగ్నోస్టిక్ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఉచిత సర్వీసులతో పాటు టాటా మోటార్స్ ఆకర్షణీయమైన డిస్కౌంట్లను కూడా అందిస్తోంది. విడి భాగాలు, లూబ్రికెంట్లపై 10 శాతం వరకు తగ్గింపు, ఎక్స్‌టెండెడ్ వారంటీపై కూడా 10 శాతం డిస్కౌంట్, జెన్యూన్ యాక్సెసరీలపై 15 శాతం వరకు తగ్గింపు లభిస్తుంది. అదనంగా వారంటీ ప్యాకేజీలు, ఏఎంసీ సేవలపై సులభమైన ఈఎంఐ సదుపాయం కూడా కల్పించారు. వినియోగదారులు తమ సమీపంలోని టాటా మోటార్స్ అధీకృత వర్క్‌షాప్‌ను సందర్శించి ఈ సేవలను పొందవచ్చు. మరిన్ని వివరాల కోసం సంస్థ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా కూడా సంప్రదించవచ్చు. వేసవిలో మీ కారు మెరుగైన పనితీరు కోసం ఈ ఉచిత చెకప్ క్యాంప్‌ను తప్పకుండా ఉపయోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# గ్యాస్ లేకున్నా వంట సులువు.. చిన్న ఎలక్ట్రిక్ కుక్కర్‌తో క్షణాల్లో రెడీ!

మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో యుద్ధ పరిస్థితుల ప్రభావంతో దేశంలో గ్యాస్ ధరలు పెరగడమే కాకుండా, కొన్ని ప్రాంతాల్లో సిలిండర్ల కొరత కూడా కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో గ్యాస్‌పై ఆధారపడకుండా వంట చేసుకునేందుకు చిన్న ఎలక్ట్రిక్ కుకింగ్ పరికరాలు మంచి ప్రత్యామ్నాయంగా మారుతున్నాయి. ముఖ్యంగా గుడ్‌సిటీ మల్టీపర్పస్ ఎలక్ట్రిక్ ట్రావెలింగ్ కుక్కర్ వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇది చూడటానికి ఎలక్ట్రిక్ టీ కెటిల్‌లా కనిపించినప్పటికీ, రోజువారీ అవసరాలకు సరిపడే అనేక వంటకాలను ఇందులో సులభంగా తయారు చేసుకోవచ్చు. గ్యాస్ స్టవ్ లేకుండానే టీ, కాఫీ, సూప్, నూడుల్స్ వంటి వంటలు క్షణాల్లో సిద్ధం అవుతాయి. ఈ కుక్కర్ ముఖ్యంగా బ్యాచిలర్స్, హాస్టల్ విద్యార్థులు, చిన్న గదుల్లో ఉండేవారికి ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే ప్రయాణాల సమయంలో కూడా సులభంగా తీసుకెళ్లే విధంగా ఇది తేలికగా, కాంపాక్ట్‌గా ఉంటుంది. సామర్థ్యం పరంగా చూస్తే, ఇది సుమారు 1.2 లీటర్ల కెపాసిటీతో వస్తుంది. ఒకరు లేదా ఇద్దరికి సరిపడా ఆహారం సులభంగా వండుకోవచ్చు. 600 వాట్ల పవర్‌తో పనిచేసే ఈ పరికరం త్వరగా వేడి అవుతుంది. నాన్‌స్టిక్ కోటింగ్ ఉండటంతో ఆహారం అడుగంటకుండా ఉండటం మరో ప్రత్యేకత. రోజువారీ వంటలలో టీ, కాఫీ, పాలు మరిగించడం, సూప్ తయారు చేయడం, నూడుల్స్ లేదా పాస్తా వండటం, గుడ్లు ఉడకబెట్టడం, ఓట్‌మీల్, కిచిడీ వంటి తేలికపాటి వంటలు సులభంగా చేసుకోవచ్చు. భారీ వంటలు చేయలేకపోయినా, సాధారణ అవసరాలకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ధర విషయానికి వస్తే, ఈ తరహా ఎలక్ట్రిక్ కుక్కర్లు సాధారణంగా రూ.1800 నుంచి రూ.2000 మధ్య అందుబాటులో ఉన్నాయి. అమెజాన్ వంటి ఆన్‌లైన్ వేదికల్లో కూడా ఇవి సుమారు అదే ధరలో లభిస్తున్నాయి. గ్యాస్ ధరలు పెరుగుతున్న ఈ సమయంలో, ఇలాంటి చిన్న ఎలక్ట్రిక్ పరికరాలు మధ్యతరగతి కుటుంబాలకు మంచి ఉపశమనాన్ని అందిస్తున్నాయి.





# తక్కువ ధరకే హై-స్పీడ్ ఇంటర్నెట్

భారతదేశ ఫిక్స్‌డ్ లైన్ బ్రాడ్‌బ్యాండ్ మార్కెట్లో ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మరోసారి వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రైవేట్ కంపెనీలతో పోటీని ఎదుర్కొంటూ, తక్కువ ఖర్చులోనే హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే లక్ష్యంతో కొత్త ఆఫర్లను ప్రవేశపెడుతోంది. ఈ క్రమంలో బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న రూ.399 ప్లాన్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్యాకేజీలో 50 ఎంబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్ సేవలు లభిస్తాయి. నెలకు సుమారు 3.3 టెరాబైట్లు వరకు డేటా వినియోగించుకునే అవకాశం ఉండటంతో, భారీ డేటా అవసరాలు ఉన్న వినియోగదారులకు ఇది ఉపయోగకరంగా మారుతోంది. అంతేకాకుండా అపరిమిత ల్యాండ్‌లైన్ కాలింగ్ సౌకర్యం కూడా ఈ ప్లాన్‌లో భాగంగా అందిస్తోంది. విద్యార్థులు, వర్క్ ఫ్రమ్ హోమ్ నిపుణులు, చిన్న కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆఫర్‌ను రూపొందించినట్లు తెలుస్తోంది. తక్కువ ధరలో మంచి స్పీడ్ కావాలనుకునే వారికి ఇది ఆకర్షణీయమైన ఎంపికగా నిలుస్తోంది. అయితే ఈ ఆఫర్ అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉండకపోవచ్చని సమాచారం. అందుకే వినియోగదారులు తమ ప్రాంతంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచిస్తున్నారు.




# విప్రో భారీ షేర్ బైబ్యాక్.. రూ.15 వేల కోట్లతో ఇన్వెస్టర్లకు తీపి కబురు

ప్రముఖ ఐటీ సంస్థ విప్రో తన వాటాదారులకు భారీ లాభం కలిగించే నిర్ణయం తీసుకుంది. కంపెనీ బోర్డు దాదాపు రూ.15 వేల కోట్ల విలువైన షేర్ బైబ్యాక్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ బైబ్యాక్ ప్రక్రియలో భాగంగా సుమారు 60 కోట్ల షేర్లను ఒక్కో షేర్‌ను రూ.250 ధరకు వెనక్కి కొనుగోలు చేయనున్నారు. ఇది కంపెనీ చరిత్రలోనే అతిపెద్ద బైబ్యాక్‌గా నిలవనుంది. మొత్తం పెయిడ్-అప్ క్యాపిటల్‌లో సుమారు 5.7 శాతం వరకు షేర్లు తిరిగి కొనుగోలు చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ ప్రక్రియను జూన్ నెలలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక తాజా ఆర్థిక ఫలితాల ప్రకారం జనవరిమార్చి త్రైమాసికంలో విప్రో రూ.3,501.8 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అదే సమయంలో మొత్తం ఆదాయం రూ.24,236.3 కోట్లుగా ఉంది. ఇన్వెస్టర్లకు అదనపు లాభంగా ఒక్కో షేరుకు రూ.11 డివిడెండ్‌ను కూడా ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో కూడా కంపెనీ భారీగా డివిడెండ్‌ల రూపంలో వాటాదారులకు లాభాలను పంచింది. మిగులు నిధులను ఇన్వెస్టర్లకు తిరిగి ఇచ్చే వ్యూహంతో విప్రో ముందుకు సాగుతుండటం మార్కెట్‌లో సానుకూల సంకేతంగా భావిస్తున్నారు.





# యంగ్ సెన్సేషన్ వైభవ్‌కు హెచ్చరికలు
# సచిన్‌ను చూసి నేర్చుకోమన్న భోగ్లే!

ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో సంచలనం సృష్టిస్తున్న వైభవ్ సూర్యవంశీకు క్రికెట్ దిగ్గజాలు కీలక సూచనలు చేశారు. చిన్న వయసులోనే వస్తున్న కీర్తి, బ్రాండ్ ఒప్పందాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ సైమన్ డూల్ మాట్లాడుతూ.. వైభవ్ తన చుట్టూ ఉండే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించాడు. మేనేజ్‌మెంట్ కంపెనీలు ఆటగాడి శ్రేయస్సు కంటే తమ లాభాలపై ఎక్కువ దృష్టి పెడతాయని, ఒకవేళ ప్రదర్శన తగ్గితే వెంటనే వదిలేసే అవకాశం ఉందని హెచ్చరించాడు. అందుకే ఎవరిని నమ్ముతున్నావో, ఎవరితో పనిచేస్తున్నావో జాగ్రత్తగా నిర్ణయించుకోవాలని తెలిపాడు. ఇదే అంశంపై ప్రముఖ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందిస్తూ, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ను ఉదాహరణగా చూపించాడు. చిన్న వయసులోనే భారీ కీర్తి సాధించినప్పటికీ, సచిన్ దారి తప్పకపోవడానికి అతని కుటుంబం ఇచ్చిన బలమైన మద్దతే ప్రధాన కారణమని వివరించాడు. వైభవ్ ప్రస్తుతం వినయంగా ఉన్నాడని, కానీ భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు ఎదురవుతాయని భోగ్లే అభిప్రాయపడ్డాడు. అలాంటి సమయంలో కుటుంబం అండగా ఉండటం చాలా కీలకమని, అదే కెరీర్‌ను సక్రమంగా ముందుకు తీసుకెళ్లేందుకు సహాయపడుతుందని సూచించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రాణిస్తూ, ఇప్పటికే పలు బ్రాండ్లకు అంబాసిడర్‌గా మారిన వైభవ్.. మైదానం బయట వచ్చే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని తన ఆటపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

# 2027 ప్రపంచకప్‌పై గురి.. అగార్కర్‌కే బీసీసీఐ మళ్లీ బాధ్యతలు!

బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న అజిత్ అగార్కర్ను పదవిలో కొనసాగించాలని బోర్డు నిర్ణయించినట్లు సమాచారం. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని ఆయన పదవీకాలాన్ని పొడిగించే యోచనలో ఉంది. ఈ విషయంపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ పనితీరుపై బీసీసీఐ పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా టీ20 ప్రపంచకప్ 2024 విజయంలో యువ ఆటగాళ్ల ఎంపిక, జట్టు నిర్మాణంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ఫలించినట్లు బోర్డు భావిస్తోంది. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తర్వాత జట్టు పునర్నిర్మాణ ప్రక్రియలో అగార్కర్ అనుభవం కీలకమని అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2027 ప్రపంచకప్ కోసం ఇప్పటి నుంచే బలమైన జట్టును సిద్ధం చేయాలనే లక్ష్యంతో బీసీసీఐ ముందుకు సాగుతోంది. ఇక కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్తో అగార్కర్‌కు ఉన్న సమన్వయం కూడా ఈ నిర్ణయానికి మరో కారణంగా కనిపిస్తోంది. జట్టు ఎంపికలో ఇద్దరి ఆలోచనలు సరిపోవడం, దీర్ఘకాలిక ప్రణాళికలకు దోహదపడుతుందని బోర్డు భావిస్తోంది. రాబోయే చాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ వంటి కీలక టోర్నీలకు కూడా అగార్కర్ నేతృత్వంలోనే జట్టును ఎంపిక చేయనున్నట్లు సమాచారం. దీంతో 2027 ప్రపంచకప్ దిశగా టీమిండియా ప్రణాళికలు మరింత వేగం పుంజుకోనున్నాయి.



# సీఎస్‌కేకు భారీ షాక్.. గాయంతో టోర్నీకి దూరమయ్యేలా ఆయుష్ మాత్రే!

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆశించిన ప్రదర్శన చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. జట్టుకు కీలక బ్యాటింగ్ ఆయుధంగా మారిన ఆయుష్ మాత్రే గాయంతో టోర్నీకి దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో పవర్‌ప్లేలోనే దూకుడుగా ఆడిన మాత్రే, బౌండరీలతో ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా ఒక ఓవర్లో వరుసగా ఐదు ఫోర్లు కొట్టి జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే రెండో పరుగు తీసే సమయంలో ఎడమ తొడ కండరాల్లో సమస్య తలెత్తడంతో అతడు తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. నడవలేని స్థితికి చేరుకోవడంతో సహాయక సిబ్బంది అతడిని మైదానం నుంచి బయటకు తీసుకెళ్లారు. మాత్రే గాయంపై స్పందించిన సీఎస్‌కే బ్యాటింగ్ కోచ్ మైక్ హస్సీ ఆందోళన వ్యక్తం చేశాడు. అతడికి హామ్‌స్ట్రింగ్ చీలిక (కండరాల గాయం) అయ్యి ఉండొచ్చని, గాయం తీవ్రతను తెలుసుకోవడానికి త్వరలో స్కాన్ చేయనున్నట్లు తెలిపాడు. గాయం తీవ్రమైతే టోర్నీ మొత్తానికి మాత్రే దూరమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాడు. మాత్రే గాయంతో జట్టు సమీకరణాల్లో మార్పులు తప్పవు. అతడి స్థానంలో కొత్త ఆటగాడిని తీసుకునే ఆలోచనలో మేనేజ్‌మెంట్ ఉంది. మూడో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం కోసం పలువురు ఆటగాళ్లు పోటీ పడుతున్నప్పటికీ, ఉర్విల్ పటేల్కు ఛాన్స్ దక్కే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే సీజన్‌లో కేవలం రెండు విజయాలతో ప్లే ఆఫ్స్ రేసులో వెనుకబడిన చెన్నై జట్టు, ఏప్రిల్ 23న ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు మాత్రే గాయం సీఎస్‌కేకు పెద్ద షాక్‌గా మారింది.





# పంజాబ్ మ్యాచ్‌లకు దూరంగా ప్రీతి జింటా.. కారణం ఇదే!

ఐపీఎల్ మ్యాచ్‌లలో ఎప్పుడూ జట్టుకు మద్దతుగా కనిపించే ప్రీతి జింటా ఈసారి పంజాబ్ కింగ్స్ మ్యాచ్‌లకు హాజరుకాకపోవడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. తాజాగా ఈ విషయంపై ఆమె స్వయంగా స్పందిస్తూ తన గైర్హాజరీకి గల కారణాన్ని వెల్లడించారు. తన కవల పిల్లలైన జై, జియాలతో సమయం గడపడం కోసం తాను క్రికెట్‌కు తాత్కాలికంగా విరామం తీసుకున్నట్లు ప్రీతి తెలిపారు. పిల్లలు పెరుగుతున్న ఈ దశలో వారి ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పాఠశాల సెలవులు ఉండటంతో వారితో కలిసి విహారయాత్రలో ఉన్నట్లు వెల్లడించారు. ఒక తల్లిగా పిల్లల ఎదుగుదలలో భాగస్వామి కావడం తనకు ముఖ్యమని, అందుకే కొంతకాలం క్రికెట్ నుంచి దూరంగా ఉండాల్సి వచ్చిందని ప్రీతి స్పష్టం చేశారు. అయితే జట్టు ప్రదర్శనపై ఆమె సంతోషం వ్యక్తం చేస్తూ అభిమానులకు ఒక గుడ్‌న్యూస్ ఇచ్చారు. లీగ్ దశ ముగిసిన తర్వాత పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటే తాను తప్పకుండా స్టేడియానికి వచ్చి జట్టును ఉత్సాహపరుస్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి ప్రాధాన్యత ఇస్తూ తీసుకున్న ఈ నిర్ణయాన్ని అభిమానులు అభినందిస్తున్నారు.

దైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక RNI NO:TGTEL/26/A0383 WWW.JANAMVOICE.COM





# పెళ్లి వార్తలతో మళ్లీ ట్రెండింగ్‌లో శ్రుతి హాసన్.. నిజమేనా?

ప్రముఖ నటి శ్రుతి హాసన్ మరోసారి తన వ్యక్తిగత జీవితంతో వార్తల్లో నిలిచారు. గతంలోలా ఇప్పుడు సినిమాల్లో పెద్దగా కనిపించని ఈ స్టార్ హీరోయిన్, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. లోకనాయకుడు కమల్ హాసన్ కూతురిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శ్రుతి, నటిగా మాత్రమే కాకుండా సింగర్, మ్యూజిక్ కంపోజర్‌గా కూడా తన ప్రతిభను నిరూపించుకుంది. తమిళం, తెలుగు భాషల్లో ఎన్నో సినిమాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల రజనీకాంత్ నటించిన 'కూలీ' సినిమాలో చివరిసారిగా కనిపించిన ఆమె, ఆ తర్వాత కొత్త ప్రాజెక్ట్‌లపై పెద్దగా ప్రకటనలు చేయలేదు. దీంతో ఆమె వ్యక్తిగత జీవితంపై వార్తలు ఎక్కువగా వస్తున్నాయి. గతంలో లండన్‌కు చెందిన మైఖేల్ కోర్సలేతో, ఆ తర్వాత విజువల్ ఆర్టిస్ట్ శాంతను హజారికాతో శ్రుతి రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ రెండు సంబంధాలు కూడా బ్రేకప్‌తో ముగిశాయి. ఇప్పుడు శ్రుతి హాసన్ అరేంజ్డ్ మ్యారేజ్‌కు ఓకే చెప్పినట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆమెకు వరుడిని వెతికే పనిలో కమల్ హాసన్ ఉన్నారని, ఇప్పటికే కొన్ని సంబంధాలు కూడా చూసినట్లు సమాచారం. అయితే, ఇలాంటి పెళ్లి వార్తలు గతంలో కూడా పలుమార్లు వచ్చి రూమర్లుగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ వార్తలపై కూడా అధికారికంగా ఎలాంటి ధృవీకరణ లేదు. ఇక సినిమాల విషయానికి వస్తే, దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో శ్రుతి నటిస్తోంది. ఈ సినిమా పలు భాషల్లో విడుదలకు సిద్ధమవుతోంది. మొత్తానికి పెళ్లి వార్తలతో మరోసారి శ్రుతి హాసన్ హాట్ టాపిక్‌గా మారింది.

# మే 20న ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు బంపర్ గిఫ్ట్స్



నందమూరి అభిమానులకు ఈసారి మే 20 నిజంగా పండగరోజుగా మారబోతోంది. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్‌లో మునుపెన్నడూ లేని విధంగా భారీ అప్‌డేట్స్ విడుదలకు రంగం సిద్ధమవుతోంది. ఒక్క సినిమా కాదు, ఏకంగా నాలుగు ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లకు సంబంధించిన ప్రకటనలు రావొచ్చని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. మొదటిగా అందరి దృష్టి ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంపై ఉంది. ఈ సినిమాకు 'డ్రాగన్' అనే పవర్‌ఫుల్ టైటిల్ ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'కేజీఎఫ్', 'సలార్' తర్వాత ఎన్టీఆర్‌ను ఎలా చూపిస్తారో అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను బర్త్‌డే రోజున విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఇక 'దేవర' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'దేవర 2'పై కూడా క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. దర్శకుడు కొరటాల శివ ఇప్పటికే స్క్రిప్ట్ పనులు పూర్తి చేసినట్లు సమాచారం. షూటింగ్ షెడ్యూల్, ఎన్టీఆర్ డేట్స్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మరోవైపు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్తో ఎన్టీఆర్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ కానుంది. 'అరవింద సమేత' తర్వాత రాబోయే ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ వినిపిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌పై కూడా మే 20న అప్డేట్ వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇక కోలీవుడ్ స్టార్ దర్శకుడు వెట్రిమారన్తో ఎన్టీఆర్ సినిమా గురించి కూడా గత కొంతకాలంగా చర్చ జరుగుతోంది. రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కే ఈ ప్రాజెక్ట్‌ను కూడా అదే రోజు అధికారికంగా ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. మొత్తంగా చూస్తే, ఈసారి ఎన్టీఆర్ పుట్టినరోజు అభిమానులకు మరచిపోలేని రోజుగా మారనుంది. నాలుగు భారీ ప్రాజెక్ట్‌ల అప్‌డేట్స్ ఒకేసారి రావడం అరుదైన విషయం. ఇప్పటికే సోషల్ మీడియాలో ఈ వార్తలు ట్రెండింగ్‌లోకి వెళ్లగా, మే 20న విడుదలయ్యే ఈ గిఫ్ట్స్‌తో ఎన్టీఆర్ మరోసారి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తాడని అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు.

## ఇన్‌స్టా సబ్‌స్క్రిప్షన్‌లోకి అనన్య నాగళ్ల..

సినిమాలపై ఆసక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నటి అనన్య నాగళ్ల ఇప్పుడు సోషల్ మీడియాలో కొత్త అడుగు వేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో సబ్‌స్క్రిప్షన్ మోడల్‌ను ప్రారంభించి అభిమానులకు ఎక్స్‌క్లూజివ్ కంటెంట్ అందిస్తోంది. షార్ట్ ఫిల్మ్‌తో కెరీర్ ప్రారంభించిన అనన్య, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. తన అందం, నటనతో కుర్రాళ్ల మనసులు దోచుకున్న ఈ బ్యూటీ, సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్ బాగా పెరుగుతోంది. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు తమ ఫాలోవర్లకు ప్రత్యేక కంటెంట్ అందించేందుకు ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ జాబితాలో ముందుగా విష్ణు ప్రియా ఉండగా, ఇప్పుడు అనన్య నాగళ్ల కూడా అదే బాటలో నడుస్తోంది. అనన్య నెలకు రూ.390 చెల్లిస్తే ఎక్స్‌క్లూజివ్ కంటెంట్ అందిస్తానని ప్రకటించింది. సాధారణంగా అందుబాటులో లేని గ్లామరస్ ఫోటోషూట్స్, ప్రత్యేక పోస్టులు సబ్‌స్క్రైబర్లకు మాత్రమే కనిపించేలా చేస్తోంది. ఇప్పటికే ఆమె సబ్‌స్క్రిప్షన్‌కు సుమారు 700 మంది పైగా అభిమానులు చేరడం గమనార్హం. దీంతో ఈ కొత్త ప్రయోగానికి మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాలతో పాటు సోషల్ మీడియా ద్వారా కూడా అభిమానులతో మరింత దగ్గరవుతున్న అనన్య నాగళ్ల, ఈ కొత్త స్టెప్‌తో మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చింది.



Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com